

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**ఆ రాత్రి సుందరేశన్**కి జగ్గయ్య దగ్గర జరిగినదంతా త్రివిక్రం చెప్పాడు.

"నాకెందుకో ఈసారి మీ డి.ఎన్.ఏలు మేచ్ అవుతాయి అనిపిస్తోంది" ఆయన చెప్పాడు.

"చూద్దాం."

"ఆదివారం ఉదయం నేను వెలగపండు పచ్చడి, బెండకాయ పచ్చడి చేసిస్తాను. వాళ్ళింటికి తీసుకెళ్ళండి."

"అది మంచి పని. భోజనానికి పిలిచినప్పుడు అన్నంలో కలుపుకునే పచ్చళ్ళు తీసుకెళితే ఆ కుటుంబ సభ్యులు కొద్దిరోజులు వాటిని తింటారు."

త్రివిక్రం తండ్రిలో ఎలాంటి మార్పు లేదు. ఆ రాత్రి త్రివిక్రం ఆయన దగ్గర కూర్చుని డైరీలోని కొన్ని పేజీలని చదివి వినిపించాడు. ఓ పేజీలో తన తండ్రి రాసిన ఓ ఆంగ్ల కవిత చదివిన త్రివిక్రంకి గొంతులో ఏదో అడ్డుపడ్డ భావన కలిగింది.

నో ఫ్లెష్ ఆఫ్ మై ఫ్లెష్
నో బోన్ ఫ్రం మై బోన్
బట్ స్టిల్ మిరాక్యులస్లీ మై ఓన్
నెవర్ ఫర్గెట్ ఫర్ ఏ సింగిల్ మినిట్
యు డిడ్ నాట్ గ్రో బినీత్ మై హార్ట్
బట్ ఇన్ ఇట్

డైరీలో అది త్రివిక్రం పుట్టినరోజు రాయబడింది.

పడుకోబోయే ముందు త్రివిక్రం తన అసలు తల్లిగురించి, తండ్రికోసం తను చేస్తున్న అన్వేషణ గురించి స్ఫూర్తికి వివరంగా ఇ మెయిల్ ఇచ్చాడు. తను పెళ్ళి చేసుకుందాం అనుకునే అమ్మాయినించి ఆ విషయాలు గోప్యంగా ఉంచదలచుకోలేదు..

హరినాథ్ డి.ఎన్.ఏ రిపోర్టు వచ్చేలోగా త్రివిక్రం నవనీత్ ఉనికిని కనిపెట్టే ప్రయత్నం చేయాలని అనుకున్నాడు. ఆ పని శ్యామలరావుకి అప్పచెప్పాడు కాబట్టి వేచి చూడసాగాడు. ఆదివారం త్రివిక్రం జగ్గయ్య ఇంట్లో భోజనం ముగించి తిరిగి ఇంటికి వస్తూంటే ఫోన్ మోగింది. అది శ్యామలరావు నించి. లైన్ కట్ చేసి తక్షణం కారుని రోడ్డు పక్కన ఆపి అతనికి ఫోన్ చేసాడు.

"సార్. గోవర్ధన్ అనే ఆయన పాతికేళ్ళ క్రితం బాలనగర్లో గాయత్రీ ఇండస్ట్రీస్ని నడిపాడని, దాన్ని వేరే వాళ్ళకి అమ్మేసాడన్న సేల్ డీడ్ని చూసాను. అందులో పేర్కొన్న రెడ్ హిల్స్లో గోవర్ధన్ చిరునామాని దాన్ని కొన్న అతను ఇచ్చాడు. కానీ ఆ ఎడ్రస్కి వెళితే పదిహేనేళ్ళ క్రితం ఆ ఇంటిని పడగొట్టి అపార్ట్మెంట్స్ కట్టారని తెలిసింది. గోవర్ధన్ గురించి ఎవరికీ తెలియదు. బిల్డర్ అడ్రస్ తెలుసుకుని

అక్కడికి వచ్చాను. హర్షవర్ధన్ రెడ్డి అనే ఆ బిల్డరు హార్ట్ అటాక్‌తో పోయాడని తెలిసింది. ఆయన పిల్లలంతా అప్పుడు చిన్నవాళ్ళు. ఆయన భార్యకి ఆ లావాదేవీల గురించి తెలీదట."

"అంటే డెడ్ ఎండా?" అడిగాడు త్రివిక్రం.

"ఇంకా అప్పుడే అలా అనుకోవద్దు. రేపు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ఆఫీస్‌కి వెళ్ళి అక్కడ గాయత్రీ ఇండస్ట్రీస్‌కి చెందిన ఇతర డైరెక్టర్ల వివరాల కోసం విచారిస్తాను. వారికి గోవర్ధన్ ఎక్కడ ఉన్నాడో తెలియచ్చు. నేను చాలాసార్లు ఆ ఆఫీసుకి ఇలాంటి పన్లమీద వెళ్ళాను. తెలిసిన వాళ్ళు ఉన్నారు. కాకపోతే అక్కడ సమాచారం చెప్పరు. అమ్ముతారు. కనీసం పదిహేను వందలు తీసుకుంటారు."

"కానండి. ఆ డబ్బు నా దగ్గర తీసుకోండి."

"అలాగే సార్."

ఆ రాత్రి ఇంటర్‌నెట్‌లో జి మెయిల్ ఛాటింగ్‌లో త్రివిక్రంకి స్ఫూర్తి తారసపడింది.

"హాయ్" విష్ చేసాడు.

"హాయ్"

కొద్ది క్షణాల తర్వాత అడిగాడు.

"నా మెయిల్ చదివారా?"

"టచింగ్. ఐ యాం సారీ ఫర్ దట్. మీ తండ్రిని కనుక్కునే ప్రయత్నం ఎంతదాకా వచ్చింది?"

"కుంటు పడుతోంది. ఐ యాం కైండాఫ్ డిప్రెస్డ్."

"ఐ యాం సారీ అగైన్."

"ఇట్స్ ఓకే"

"వాట్ నెక్స్ట్?"

"మనం కలవాల్సిన పని ఒకటి చాలా కాలంగా పెండింగ్‌లో ఉండిపోయింది. ఇటీవల కొన్ని గోల్డెన్ రూల్స్ చదివాను. అందులో మూడోది "నీకు ఇష్టంలేని పనిని వాయిదా వేయకుండా వెంటనే చెయ్యి అని. దాన్ని పాటించమని సలహా."

"నేనే సలహాని కోరను. ఇచ్చినా పాటించను. అది నా నియమం."

"సలహా తీసుకోవడం అంటే ఇతరుల మేథస్సుని ఉపయోగించుకోవడమేగా?"

"నేను తాజ్‌మహల్‌ని కట్టించనా? అని షాజహాన్ సలహా అడిగి ఉంటే దాన్ని ఎన్నటికీ ఆయన నిర్మించగలిగేవాడు కాడు. అవునా?"

"వెల్ సెడ్"

"ఆ గోల్డెన్ రూల్స్‌లోని రెండవది ఏమిటి?"

"నీ కోసం కూడా నువ్వు కొంత చేసుకో."

"మొదటిది?"

"ఇతరుల కోసం కూడా కొంత చెయ్యి."

"ఈ రెండో నియమం బాగుంది. ఐతే రేపు కలుద్దాం."

"ఎప్పుడు? ఎక్కడ?"

"ఆబిడ్స్‌లో జనరల్ పోస్టాఫీసు పక్కన, రామకృష్ణా థియేటర్‌కి వెళ్ళేవైపు ఎడం వైపు ఓ రగడా బండి ఉంటుంది. అక్కడ కలుద్దాం."

"రోడ్డు మీద అమ్మే బండిలోది నేను తినను."

"దాని రుచి ఓసారి చూస్తే ఇక వదలరు."

"వై నాట్ ఇన్ మేక్ డొనాల్డ్స్? లేదా సబ్‌వే సేండ్‌విచ్‌లో కలుద్దాం అవి హిమాయిత్ నగర్‌లో ఉన్నాయి."

"రోడ్ సైడ్ రగడా నా ప్రిఫరెన్స్. సాయంత్రం ఆరున్నరకి అక్కడ కలుద్దాం."

"బేరం లేదా?"

"సరే. మెక్‌డొనాల్డ్స్ హిమాయిత్ నగర్‌లో. కాకపోతే మా ఇంటికి అక్కడనించి డైరెక్ట్ బస్ లేదు. అబిడ్స్ నించి ఉంది."

"ఎక్కడా మీ ఇల్లు? నేను డ్రాప్ చేస్తాను."

"బి.హెచ్.ఈ.ఎల్."

"ఐతే డ్రాప్ చేయను. ఆ రూట్‌లో, ఆ ట్రాఫిక్‌లో నేను డ్రైవ్ చేయలేను. ఆబిడ్స్‌లో డ్రాప్ చేస్తాను."

"లక్డీ కా పూల్ మీకు దగ్గర. నాకు సౌకర్యం."

"డన్."

## 14

ఆ రోజు సాయంత్రం తను స్ఫూర్తిని కలవబోతున్నందుకు త్రివిక్రంకి ఎక్సయిటింగ్‌గా ఉంది. అతనికి ఆమె గురించి రకరకాల ఆలోచనలు కలిగాయి. ఇలాంటి సందర్భాల్లో స్వంత సోదరి లేదా మామ దగ్గరికి విధవ కోడలు వచ్చిన కథలని తను చదివాడు. తన విషయంలో ఆ ప్రమాదం లేదు. అలా వచ్చే ఆడపిల్లలు తమ బంధువర్గంలో లేరు.

ఏ యాభై ఏళ్ళావిడో వచ్చి తనే స్ఫూర్తిని అని, తన అసలు పేరు మెహరున్నీసా అని అంటుందా? ఏ ముప్పై ఐదేళ్ళ విధవరాలో వస్తుందా? ఎవరైనా యువకుడు వచ్చి 'గాచ్చా' అని తనని చూసి పరిహాసంగా అరుస్తాడా? అతనికి కొంత ఉత్కంఠగానే ఉంది. సాయంత్రం ఆరున్నర ఎప్పుడు అవుతుందా అని త్రివిక్రం ఎదురు చూడసాగాడు.

శ్యామలరావు ఆ రోజు బొలారంలోని ఓ ఇంటికి వెళ్ళాడు. నవనీత్ పేరుని, చిరునామాలని టెలిఫోన్ డైరక్టరీ లోంచి రాసుకుని, ఒకో చిరునామాకి వెళ్ళి తనకి కావలసిన నవనీత్ వారిలో ఉన్నాడేమో ఎంక్వైరీ చేస్తున్నాడు.

ముందు గదిలో ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఆ సమయంలో ఫోన్‌లో మాట్లాడుతోంది. ఆ సంభాషణని బట్టి ఆమె టి.వి.9ని లేదా ఎన్.టి.విని బాగా చూస్తుందని శ్యామలరావు భావించాడు. అవతలి సంభాషణ కూడా ఫోన్‌లోంచి శ్యామలరావుకి స్పష్టంగా వినబడుతోంది.

"శేఖర్! విజయవాడని అమ్మా, నాన్న లీవ్ చేసారా? శేఖర్" ఆ అమ్మాయి అడిగింది.

"సుజని. బాబాయి ఇవాళ ఉదయం బెజవాడ నించి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో లీవ్ చేసాడని తెలుస్తోంది సుజని" అవతలివైపు నించి ఓ మగ కంఠం వినిపించింది.

"శేఖర్! వారు ఈ పాటికి వరంగల్ రీచ్ అయ్యారంటావా?"

"సుజని ఆ రైలు షెడ్యూల్ ప్రకారమైతే ఈ పాటికి వరంగల్ రీచ్ అయి ఉండాలి. కానీ ఏ కారణంగానే అది ఆలస్యంగా నడుస్తూంటే మాత్రం ఇంకా వరంగల్‌కి రీచ్ అయి ఉండదు. సుజని"

"శేఖర్! ఒక వేళ ఆ రైలు టైమ్‌కే నడుస్తూంటే మా అమ్మా నాన్న రైల్లో మీల్స్ చేసి ఉంటారంటావా? శేఖర్"

"సుజని అది వాళ్ళు మీల్స్ బుక్ చేసుకున్నారా లేదా అన్న దాని మీద డిపెండ్ అయి ఉంటుంది. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో అసలు మీల్స్ ఫెసిలిటీ ఉందో లేదో కూడా నాకు క్లారిటీ లేదు. సుజని"

"శేఖర్! ఒకవేళ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో మీల్స్ ఫెసిలిటీ ఉంటే, వాళ్ళు మీల్స్‌ని బుక్ చేసుకున్నారని థింక్ చేస్తున్నావా?"

"సుజని బుక్ చేసుకుంటే ఈ పాటికి మీల్స్ ఈట్ చేసి ఉంటారని థింక్ చేస్తున్నాను. సుజని."

"శేఖర్ ఒకవేళ ప్రయాణీకులంతా మీల్స్ బుక్ చేసుకుంటే, అందరికీ సరిపడే మీల్స్ ఆ రైలులో అవైలబుల్‌గా ఉండవచ్చని తెలుస్తోందా? అప్పుడు అమ్మా, నాన్న బుక్ చేద్దామనుకున్నా దొరికిందో లేదో? ఈ విషయం మీద నువ్వు ఏం అనుకుంటున్నావు? శేఖర్"

"సుజని ఆ విషయంలో నాకు క్లారిటీ లేదు. సుజని"

"శేఖర్ ఈ క్లారిటీ ఎప్పటికి రావచ్చు? శేఖర్"

"సుజని బాబాయి రైలు దిగి మీ ఇంటికి వచ్చాక నువ్వు వాళ్ళని ఈ క్వశ్చన్ అడిగినప్పుడు నీకు వాళ్ళేం చెప్తారో అది నాకు చెప్తే అప్పుడే నాకు క్లారిటీ వస్తుంది. సుజని"

"శేఖర్ రైలు మీల్స్‌లో సాధారణంగా ఏమేం ఉంటాయి? శేఖర్"

"సుజని! నాటు యాభై గ్రాముల రైస్, ఓ చపాతీ, కొద్దిగా సాంబారు, లెమన్ పికిల్, పుల్ల కర్డ్, కర్రీ, ఉండొచ్చు. ఒకోసారి కర్రీ ఉండకపోవచ్చు కూడా. సుజనీ"

శ్యామలరావుకి ఆ సంభాషణ ముగిసే సూచనలు కనబడలేదు.

"శేఖర్ ఇవాళ కర్రీ ఉండి ఉండవచ్చని నువ్వు థింక్ చేస్తున్నావా? లేకపోతే అందుకు రీజన్ ఏమై ఉండచ్చు. అవైలబిలిటీ లేకా? లేదా అదర్ రీజన్ ఉండొచ్చని భావిస్తున్నావా? శేఖర్"

"సుజని అది వాళ్ళు మీల్స్ బుక్ చేసుకున్నారా లేదా అన్న దానిమీద డిపెండ్ అయి ఉంటుంది. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో అసలు మీల్స్ ఫెసిలిటీ ఉందో లేదో కూడా నాకు క్లారిటీ లేదు. సుజని"

"శేఖర్ ఒకవేళ ప్రయాణీకులంతా మీల్స్ బుక్ చేసుకుంటే అందరికీ సరిపడే మీల్స్ ఆ రైలులో అవైలబుల్‌గా ఉండవచ్చని తెలుస్తోందా? అప్పుడు అమ్మా, నాన్న బుక్ చేద్దామనుకున్నా దొరికిందో లేదో? ఈ విషయం మీద నువ్వు ఏం అనుకుంటున్నావు? శేఖర్"

"సుజని ఆ విషయంలో నాకు క్లారిటీ లేదు. సుజని"

"శేఖర్ ఈ క్లారిటీ ఎప్పటికి రావచ్చు? శేఖర్"

"సుజని బాబాయి రైలు దిగి మీ ఇంటికి వచ్చాక నువ్వు వాళ్లని ఈ క్వశ్చన్ అడిగినప్పుడు నీకు వాళ్ళేం చెప్తారో అది నాకు చెపితే అప్పుడే నాకు క్లారిటీ వస్తుంది. సుజని"

"శేఖర్ ! రైలు మీల్స్‌లో సాధారణంగా ఏమేం ఉంటాయి? శేఖర్!"

"సుజని! నూట యాభై గ్రాముల రైస్, ఓ చపాతీ, కొద్దిగా సాంబారు, లెమన్ పికిల్, పుల్ల కర్డ్, కర్రీ, ఉండొచ్చు. ఒకోసారి కర్రీ ఉండకపోవచ్చు కూడా సుజనీ"

శ్యామలరావుకి ఆ సంభాషణ ముగిసే సూచనలు కనబడలేదు.

"శేఖర్! ఇవాళ కర్రీ ఉండి ఉండవచ్చని నువ్వు థింక్ చేస్తున్నావా? లేకపోతే అందుకు రీజన్ ఏమైనా ఉండచ్చు. అవైలబిలిటీ లేకా? లేక అదర్ రీజన్ ఉండొచ్చని భావిస్తున్నావా? శేఖర్!"

"సుజని అదర్ రీజన్ ఉండొచ్చని భావిస్తున్నాను. ఎందుకంటే ప్రైసెస్‌తో సంబంధం లేకుండా రైల్వే క్యాంటిన్‌కి ఏడాది పొడుగూతా కూరలని ముందు నిర్ణయించిన ప్రైసెస్‌కే కాంట్రాక్టర్ సప్లై చేస్తాడు. ఫాం నించి కాంట్రాక్టర్ వెజిటబుల్స్‌ని డైరెక్ట్ పర్చేజ్ చేస్తాడు కాబట్టి, అతనికి వెజిటబుల్స్ అవైలబుల్ లేవనే ప్రాబ్లం ఉండదు. సమ్ అదర్ రీజనై ఉండాలి సుజనీ!"

"థాంక్ యూ శేఖర్. మళ్ళీ నెసెసిటీ వస్తే కాంటాక్టు చేస్తాను" సుజని లైన్ కట్ చేసి శ్యామలరావు వంక ప్రశ్నార్థకంగా చూసింది.

"నవనీత్ రావుగారి గురించి వచ్చాను."

"ఇంతదాకా వినలేదా? ఆయన ఊళ్ళోలేరు. ఆఫీస్ పనిమీద విజయవాడకి కేంప్‌కి వెళ్ళారు. రాత్రికి వస్తారు. ఆయనతో మీకేం పని?"

"మీ తాతగారి పేరు గోవర్ధనా?" అడిగాడు శ్యామలరావు.

"ఊహూ. గోష్పాదం."

"ఓ సారీ నేను వెదికే నవనీత్ ఆయన కాదు."

బయటకి వచ్చి జాబితాలోంచి మరో అడ్రస్‌ని కొట్టేసాడు.

ఆ మధ్యాహ్నం త్రివిక్రంకి శ్యామలరావు ఫోన్ చేసాడు. అప్పుడే కడుపులోంచి ఓ గడ్డని ఆపరేషన్ ద్వారా తొలగించి త్రివిక్రం థియేటర్ లోంచి బయటకు వచ్చాడు.

"చెప్పండి శ్యామలరావుగారూ. తెలిసిందా?" అడిగాడు.

"రిజిస్ట్రార్ ఆఫీసులో డైరెక్టర్ల అడ్రస్ తీసుకున్నాను. అన్నీ పడగొట్టిన గోవర్ధన్ ఇంటి అడ్రసులే. బహుశా వారంతా ఆయన బంధువులు అనుకుంటా. అంతకుమించి వేరే వివరాలేం లభించలేదు."

"అంటే మళ్ళీ డెడ్ ఎండేనా?"

"ప్రస్తుతానికి సేల్స్ టాక్స్ ఆఫీసులో కూడా ప్రయోజనం ఉండదు. అవే చిరునామాలు ఉంటాయి. ఆలోచిస్తాను."

"ఆయన్ని కలుసుకోగలిగితే ఇక మీరు ఇలాంటి పని ఇంకేమీ చెప్పను. ఇదే ఆఖరి అసైన్‌మెంట్. ఎలాగైనా మీరే నవనీత్‌ని పట్టుకోవాలి."

"ప్రయత్నిస్తాను. ఆయనేకదా ఆ నలుగురిలో మిగిలి ఉంది. ఆయన ఏం చేసేవారో తెలీదా?"

"ఉహూ. మీకు ఇవ్వాల్సిన పదిహేను వందలు."

"మంత్లీ చెక్ కోసం ఇంకో వారంలో ఎటూ వస్తాకదా సార్? తొందరలేదు సార్. అప్పుడే తీసుకుంటాను."

శ్యామలరావు బదులు చెప్పాడు.

ఆ5

హిమాయత్ నగర్‌లోని మెక్‌డొనాల్డ్స్‌లో ఆరూ నలభై అయిదుదాకా ఎదురుచూస్తూ కూర్చున్న త్రివిక్రం, ఇక స్ఫూర్తి రాదు, చెయ్యి ఇచ్చి ఉండచ్చు అనుకున్నాడు. మెక్‌డొనాల్డ్స్ రెస్టారెంటా లేక సబవేనా? అనే అనుమానం కూడా అతనికి కలిగింది. ఐదున్నరా? లేక ఆరున్నరా? అనే ఇంకో అనుమానం కూడా కలిగింది. ఆ అనుమానాలు కలగడానికి కారణం, స్ఫూర్తి తప్పక వస్తుందన్న నమ్మకమే.

ఎస్.ఎమ్.ఎస్ వచ్చిన గంట మోగడంతో సెల్‌ఫోన్‌లో దాన్ని చూసుకున్నాడు.

'నేను ఐదు నిమిషాల్లో అక్కడ ఉంటాను. ఉండకపోతే ఇదే ఎస్.యం.ఎస్‌ని మరోసారి చదవండి.'

నవ్వుకున్నాడు. కొద్ది నిమిషాల్లో ఓ అమ్మాయి ఇంకో సీటులోంచి త్రివిక్రం ముందుకి వచ్చి ఆగి అడిగింది.

"ఎక్స్‌క్యూజ్‌మీ! మీరు డాక్టర్ త్రివిక్రమా?"

"అవును. మీరు స్ఫూర్తా?"

"అవును. నేను అక్కడ కూర్చున్నాను. మీరు నా దగ్గరకి వస్తారని అనుకున్నాను. కనీ మీరు నన్ను గుర్తించలేదు అనిపించి నేనే లేచి వచ్చాను."

"కూర్చోండి. సారీ! నేనే మిమ్మల్ని గమనించలేదు."

"ముందు ఏదైనా తీసుకుందాం. నాకు మేక్ వెజ్జీ, మేక్ ఆలూ టిక్కీ, కోక్. ఫ్రెంచ్ ఫ్రైస్. పొటాటో వెడ్జెస్‌ని ఇద్దరం షేర్ చేసుకుందాం. ఇక రాత్రికి భోజనం చేయను."

"నేను వెజ్ పీజా, మేక్ పఫ్, పొటాటో వెడ్జెస్ తీసుకుంటాను."

"కోక్?"

"నో."

ఇద్దరూ కేషియర్ దగ్గరకి వెళ్ళి అవి ఆర్డర్ చేసాక త్రివిక్రం డబ్బు చెల్లించాడు. మళ్ళీ వెళ్ళి కూర్చున్నారు. స్ఫూర్తి వయసు ఇరవైపైనే ఉండొచ్చని అనుకున్నాడు. తనకన్నా కనీసం తొమ్మిదేళ్ళు చిన్నది. ఇంత చిన్న అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని ఆలోచించడం అన్యాయం అని అతనికి అనిపించింది. అలసటగా ఉన్నా ఆమె మొహంలో మంచి కళ ఉంది. అది పెద్ద కళ్ళవల్ల కలిగిందని గ్రహించాడు. త్రివిక్రంకి ఆ పిల్ల మొహంలో కొద్దిగా అమాయకత్వం కనిపించింది.

"సో?" అడిగింది స్ఫూర్తి నవ్వుతూ.

"సో, మనం మొత్తానికి కలిసాం."

"అవును. రగడా నాకు చాలా ఇష్టం."

"నాకూ చాలా ఇష్టం. కానీ రోడ్ సైడ్‌వి నేను తినను. అనారోగ్యం."

"నా చిన్నప్పటినుంచీ నేను తింటున్నా నాకిప్పటిదాకా అనారోగ్యం రాలేదా?"

"మీలో ఇమ్యూనిటీ ఏర్పడి ఉండచ్చు. ఐతే అపరిశుద్ధ నీటినించి ఇమ్యూనిటీ ఉండదు. ఉదాహరణకి పచ్చ కామెర్లు. అది అపరిశుద్ధ నీటి ద్వారానే వస్తుంది. దాదాపు రోడ్ మీద దొరికేవన్నీ అపరిశుద్ధ నీటితోనే చేయబడతాయి."

నంబర్ పిలవగానే స్ఫూర్తి లేచి వెళ్ళి ట్రేని తీసుకువచ్చింది. నోటితో టమోటా కెచప్ పాకెట్‌ని కొరికి తెరిచి మొత్తం ఫ్రెంచ్ ఫ్రైస్ మీద కుమ్మరించింది.

"మీ నాన్నగారి విషయం ఎంతదాకా వచ్చింది? ఐ మీన్ మీరు వెతికే నాన్నగారి విషయం" అడిగింది.

సంక్షిప్తంగా చెప్పాడు త్రివిక్రం.

"ఆ డి.ఎన్.ఏ రిపోర్టు వచ్చాక హరినాథా, లేక నవనీతా అన్నది తేలుతుంది అన్నమాట."

"అవును. నవనీత్ ఎక్కడ ఉన్నాడో ఇంకా తెలీలేదు. ప్రయత్నం చేస్తున్నాను."

కొద్ది క్షణాలాగి అడిగాడు.

"మీ భర్త ఎలా ఉండాలని మీ కల?"

"అందరు మగాళ్ళకి తమ భార్య విషయంలో గల మూడు కలలకి అనుగుణంగానే జీవించాలని. కాబట్టి ప్రత్యేకంగా ఓ కలంటూ లేదు."

"భార్యల విషయంలో మూడు కలలా? నేనెన్నడూ అలాంటిది వినలేదే?" ప్రశ్నించాడు త్రివిక్రం.

"మీరు వినకపోయినా మీకూ ఉంటాయవి, అతని తల్లి కోడలు విషయంలో ఎదురు చూసినంత నమ్రతగా నేను ఉండాలని, అతని తల్లి చేసేంత రుచిగా నేను వండాలని, అతను నన్ను అనుమానించేంత అందంగా ఉండాలని."

కొన్ని క్షణాలు ఆలోచించి అడిగాడు.

"ప్రేమ? అతను మిమ్మల్ని ఎవరూ ప్రేమించనంతగా ప్రేమించాలని లేదా?" "ప్రేమ మీద నా అభిప్రాయం జనాభిప్రాయం కాదు. ఆ విషయంలోనే నేను బాగా ప్రాక్టికల్. వేలంటైన్స్ డేకి పూలగుత్తి, చాక్లెట్ బాక్సులు తీసుకురాకపోతే అతను నన్ను ప్రేమించటంలేదని నేను భావించను. ప్రేమ అనేది జీవితమంతా విస్తరించుకుని ఉండాలి కానీ, ఇలా పుట్టినరోజుకీ, పెళ్ళిరోజుకీ, లేదా వేలంటైన్ డేస్‌కి మాత్రమే ప్రదర్శించేలా ఉండకూడదు. ఈ కొత్త పద్ధతి నిజానికి పనికిరాని అనుకరణ. ఆ రోజు భర్తా, లేక బాయ్ ఫ్రెండ్ ప్రత్యేకంగా లేకపోతే ప్రేమ లేదనే దురభిప్రాయం ఏర్పరచుకునే ప్రమాదం ఉంది. ఫిబ్రవరి మొదటివారం ఏ పత్రిక లేదా టివిని చూసినా రెండవ వారంలో వచ్చే వేలంటైన్స్ డే గురించే. పాశ్చాత్యుల్లో ప్రేమ ఎప్పుడూ అనుమానించదగ్గ స్థాయిలో ఉంటుంది కాబట్టి, వారు ఏడాదికి కొన్ని సార్లయినా తమ ప్రేమని పునరావిష్కరించుకోడానికి ఫిబ్రవరి పధ్నాలుగు ఉపయోగిస్తుంది. అసలు అలాంటి అనుమానమే ఎన్నడూ కలగని మన సంప్రదాయంలో వీటికి చోటులేదు. నేను సాంప్రదాయవాదిని. వీటిని నేను తిరస్కరిస్తాను."

"నిజమే. మీ అంత మెచ్యూర్డ్‌గా నేటి టీనేజర్స్ ఆలోచించడంలేదు."

"ఏమిటో ఈ పిచ్చి? తనని తప్ప ఇతరులని ఎవ్వరినీ ప్రేమించలేని పాశ్చాత్య దేశాల నించి వచ్చిన ఈ సంస్కృతి నా ఉద్దేశ్యంలో చెడ్డది. ఫిబ్రవరి పధ్నాలుగే భర్త తన భార్యకి ప్రేమని వ్యక్తం చేయాలా? మిగిలిన మూడు వందల అరవై నాలుగురోజులు ఆ ప్రేమ ఉండదా? ఆ రోజే దాన్ని తప్పనిసరిగా ప్రదర్శించటం ప్రేమకి కొలబద్దా? మిగిలిన రోజుల్లో ఆ అవసరం లేదా? ఐనా ప్రేమని చర్యలద్వారానే వ్యక్తం చేసే సంస్కృతి మనది. రైల్లో కిటికీ పక్క చలిగాలి వేసే సీట్లో తను కూర్చుని తన భార్యకి మంచి సీటు ఇవ్వటం, ములక్కాడ ముక్కలన్నిటినీ భార్యకి ఇవ్వటం, భార్యకి ఇష్టమని తను పెద్దగా తినకపోయినా దొండకాయల్ని కొనుక్కురావటం, భార్యకి మేచింగ్ జాకెట్‌ని ఊరంతా తిరిగి భర్త తీసుకురావటం.. నన్నడిగితే ఇదీ ప్రేమంటే. గ్రీటింగ్ కార్డుల ద్వారా ప్రేమని మనం వ్యక్తం చేయలేం. చాక్లెట్స్, పూలగుత్తి, గ్రీటింగ్ కార్డు ఏ నాటికైనా చెత్త బుట్టలోకి చేరాల్సిందే నన్నడిగితే చాక్‌లెట్ బాక్స్ నయం. పాశ్చాత్య కుటుంబ సభ్యుల మధ్య గల ప్రేమతో పోలిస్తే మన కుటుంబ సభ్యుల మధ్య గల ప్రేమ పటిష్టంగా ఉంటుంది. భారతీయ దంపతుల్లోని జీవితాల్లో ప్రతి దినం ఓ వేలంటైన్స్ డేనే."

"నేనూ మీతో ఏకీభవిస్తాను. మీకు చాలా విషయాల మీద నిశ్చితాభిప్రాయాలు ఉన్నాయన్నమాట."

"అవును. మా ఇంట్లో మా ఎదురుగా మా అమ్మానాన్నలు ఇలాంటి చర్చలని చిన్నప్పటినించీ చేసుకుంటూండగా ఎన్నో విన్నాము. మేము ఎమోషనల్ కాదు. భావావేశం మనిషికి డైనమేట్‌లా ఎప్పటికీ ప్రమాదమే అని మా తల్లితండ్రుల అభిప్రాయం. అది మాలో రాకుండా వారెంతో జాగ్రత్తగా మమ్మల్ని పెంచారు. ఇలాంటి భావావేశంతోనే మా పిన్ని ఆత్మహత్య చేసుకుంది. మొగుడు తనకి కెంపుల గాజులు కొనకుండా, స్థలం కొనడంతో తనమీద ఆయనకి ప్రేమలేదని ఉత్తరం రాసి పెట్టి ఉరేసుకుంది."

"ఆమె మోస్ట్ ఇమెచ్యూర్డ్ అన్నమాట."

"భావావేశం స్లో పాయిజన్ అని మా నాన్న ఎప్పుడూ మమ్మల్ని హెచ్చరిస్తూంటారు. మన భావాలు మన ఆధీనంలో ఉండాలనుకోవు. కాబట్టి, మనం ఎప్పటికప్పుడు వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తుండాలి అన్నది మా పేరెంట్స్ మాకు నేర్పిన పాఠం."

ఇద్దరి మధ్యా కొన్ని క్షణాలు మౌనం తర్వాత త్రివిక్రం చెప్పాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in